1997
మార్చి 30న

# స్త్రీలపైన లైంగిక హింస

## సమాజం - చట్టం - కోర్టులు

సదస్సు

అందరూ అసహ్యించుకుంటున్నప్పటికీ నిత్యం జరుగుతున్న నేరాలలో లైంగిక అత్యాచారం ఒకటి. గడచిన నాలుగు సంవత్సరాలుగా మన రాష్ట్రంలో సగటున సంవత్సరానికి 700 పై చిలుకు అత్యాచారం కేసులు నమోదవుతున్నాయి. పోలీస్ స్టేషన్‌లో కేసుగా నమోదు కాకున్నా పత్రికలలో వార్తగా నమోదయ్యేవి సగటున 1000 నుండి 1500 దాకా ఉన్నాయి. వార్త రూపంలో వెలుగుకూడ చూడని ఘటనలు ఎన్ని జరుగుతున్నాయో ఎవరికీ తెలియదు. రహస్యంగా జరిగి రహస్యంగా మిగిలిపోయే నేరాలలో లైంగిక అత్యాచారం మొదటిది.

నేరాలకు రకరకాల కారణాలుంటాయి. గతిలేక చేసే నేరాలుంటాయి. కక్షకొద్దీ చేసే నేరాలుంటాయి. క్షణిక ఉద్రేకంతో చేసే నేరాలుంటాయి. కడుపు మంటవల్ల చేసే నేరాలుంటాయి. కొన్ని నేరాలలో అధికారపు ప్రదర్శన ఒక ముఖ్య అంశంగా ఉంటుంది. స్త్రీలపైన మగవాళ్ళు పాల్పడే లైంగిక హింస, లైంగిక వేధింపులు ఈ కోవకు చెందిన నేరాలు. రేప్ మాత్రమే కాదు, రోడ్డు పక్కన నిలబడి స్కూలుకూ, కాలేజీకీ పోయే అమ్మాయిలను వేదించడం, బస్సులో ఆఫీసులో కాలేజీలో బజారులో వెకిలిగా ప్రవర్తించడం కూడ స్త్రీ శరీరంపైన మగవాడికి ఉండే అధికారాన్ని ప్రదర్శించడమే. దీనిని 'అసభ్య' ప్రవర్తన అనీ 'పోకిరీ చేష్ట'లనీ, ఇంగ్లీషులో సున్నితంగా 'ఈవ్-టీజింగ్' అనీ అనడం వల్ల అందులో హింస ఉందన్న సంగతి మరుగున పడుతూ ఉంది. ఆధిపత్యం నుండి పుట్టే నేరాలను రూపుమాపడం కష్టం. ఆ కృషి సమాజం మూలాలలోకి పోతుంది. ఆకలిలాగ, అంటరానితనంలాగ, పోలీసు కస్టడీ మరణాలలాగే లైంగిక హింసకూడ. స్త్రీ పురుషుల స్థానాల గురించి, లైంగికత గురించి, నీతి నియమాల గురించి, సహజమైనవిగానూ న్యాయమైనవిగానూ సమాజం భావించే విషయాలలో ఈ హింస సన్నిహితంగా ముడిపడి ఉంది. ఇటువంటి నేరాలలో హింసకు పాల్పడినవారి ప్రవర్తన తప్పనిపించినా - సహజంగా కనిపిస్తుంది. హింసకు గురయిన వారినే తప్పుపట్టాలనిపిస్తుంది. ఒంటరిగా బజార్లో తిరగకపోతేనేం? మగవాళ్ళతో అనవసరంగా స్నేహం చేయకపోతేనేం? అందమయిన బట్టలు వేసుకోకపోతేనేం?

ఈ సంవత్సరం జనవరి 1 నాడు వరంగల్ జిల్లా పరకాల మండలంలోని వరికోలు గ్రామంలో ఒక ఘోరమైన ఘటన జరిగింది. పోచంపల్లి యాదవ్వ అనే 9వ తరగతి విద్యార్థిని కొత్త సంత్సరం ఉదయించిందన్న ఉత్సాహంతో తనకు పరిచయం ఉన్న ప్రతీ ఒక్కరి ఇంటికీ పోయి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పుదామని బయలుదేరింది. అమాయకమైన ఈ ఉత్సాహాన్ని వాడుకొని కుమారస్వామి అనే పరిచయస్తుడు ఆమెను తన ఇంట్లోకి పిలిచి బలాత్కరించాడు. గాయపడిన మనసుతో ఆ అమ్మాయి ఆ సాయంత్రమే పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకుంది. ఆమెకు నూతన సంవత్సరం ఆ విధంగా తొలినాడే ముగిసింది. కుమారస్వామిని అందరూ తిట్టే ఉంటారు. పోలీసులకు పట్టించే ఉంటారు. కానీ బహుశా అతని ప్రవర్తన కంటె ఆమె ప్రవర్తనే అసహజంగా తోచి ఉంటుంది. ఎన్నడూ లేని ఈ కొత్త పోకడలకు పోకపోతేనేం, ప్రాణంమీదికి తెచ్చుకోక పోతేనేం?

నిజానికి లైంగిక హింసకు గురయ్యే స్త్రీలలో ఎక్కువ మంది ఏ 'కొత్త పోకడలకూ' పోని వారే. అదేమిటో తెలియని పసిపిల్లలనుండి నేరస్తుడికి తల్లివయసులో ఉన్న స్త్రీలదాకా 'కాదేస్త్రీ అత్యచారానికీ లైంగిక హింసకూ అనర్హురాల'ని సంఘటనలను పరిశీలిస్తే అర్థం అవుతుంది. ఉదాహరణకు గత సంవత్సరం చివరి ఆరునెలలలో కృష్ణాజిల్లాలో అత్యాచారానికి గురయిన 22 మంది స్త్రీలలో 10 మంది బాలికలే. వారి వయసులు 11నుండి 16 సంవత్సరాలలోపు. అదే కాలంలో ప్రకాశం జిల్లాలో అత్యాచారానికి గురయిన 23 మందిలో ఆరుగురు బాలికలు. కన్నతండ్రి చేత, చిన్నాయనచేత, మేనమామ చేత బలాత్కరించబడిన అమ్మాయిలు చాలా మంది ఉన్నారు. ఈ అమ్మాయిలు వారి సంరక్షణ లో ఉంటారు. కాబట్టి తప్పించుకోవడం చాలా కష్టం. ఈ హింసను అరికట్టే చట్టాలు లేవా అంటే ఉన్నాయి. స్త్రీని ఆమె ఇష్టానికి వ్యతిరేకంగా లైంగికంగా అనుభవించే హక్కు ఆమె భర్తకు చట్టం ఇచ్చింది. అనాగరికమైన ఈ మినహాయింపును తొలగించమని మహిళా ఉద్యమం చాలా కాలంగా అడుగుతున్నప్పటికీ మన చట్టసభలకు పట్టలేదు. ఇది మినహాయించి లైంగిక హింసను చట్టం తీవ్రమైన నేరంగానే గుర్తించిందని చెప్పాలి. దీనిని భారతశిక్షాస్మృతి మూడు నేరాలుగా వర్గీకరించింది. లైంగిక అత్యాచారాన్ని అంటే బలవంతపు సంభోగాన్ని సెక్షన్ 376లోను, ఇతర రూపాల లైంగిక హింసను సెక్షన్ 354లోను, కించపరిచే మాటలు చేష్టలు సైగలు చేయడాన్ని సెక్షన్ 509లోను నేరంగా నిర్వచించింది చట్టం. మొదటి నేరానికి 10 సం॥ల దాకా, రెండవ నేరానికి రెండేళ్లదాకా, మూడవ నేరానికి 1 సంవత్సరం దాకా శిక్ష వేయవచ్చునని చట్టం అంటుంది.

రాష్ట్రంలో 1987-95 మధ్యకాలంలో పోలీస్ స్టేషన్‌లలో నమోదయిన లైంగిక హింస కేసుల సంఖ్య

| | 1987 | 88 | 89 | 90 | 91 | 92 | 93 | 94 | 95 |
|---|---|---|---|---|---|---|---|---|---|
| లైంగిక అత్యాచారం (సెక్షన్ 376) | 448 | 491 | 538 | 596 | 669 | 737 | 769 | 826 | 792 |
| లైంగిక వేధింపు (సెక్షన్ 354) | 1365 | 1636 | 1953 | 2109 | 1768 | 1936 | 1870 | 2258 | 2692 |
| మొత్తం | 1813 | 2127 | 2491 | 2705 | 2437 | 2673 | 2639 | 3084 | 3484 |

చట్టం దోషిని శిక్షించాలంటుంది కానీ కోర్టులో ఈ కేసులు విచారణకు వచ్చేటప్పుడు 'ఆమె ఎటువంటిది?' అనే ప్రశ్న ప్రధానమయి పోతుంది. ఆ ఘటన ఆమె ఇష్టానికి వ్యతిరేకంగా జరిగిందా లేదా అన్న చర్చకు విచారణ పరిమితం కావలసింది పోయి, ఆమె సాధారణ నడవడిక పితృస్వామ్య లైగింక నీతికి అనుగుణంగా ఉందా లేదా అన్న చర్చ జరుగుతుంది. పూర్తిగా అప్రస్తుతమైన ఈ విచారణ బాధితురాలి విశ్వసనీయతకు ప్రమాణం అవుతుంది.

కేవలం కోర్టులో మాత్రమే కాదు. బయటకూడా ఇదే జరుగుతుంది. రేప్ జరిగిందని తెలియగానే సమాజం చర్చించేది నేరంచేసిన వాడి దుర్మార్గాన్ని కాదు, బాధితురాలి వ్యక్తిత్వాన్ని. ఈ భయంవల్ల సగం ఘటనలు బయటి ప్రపంచానికి తెలియనే తెలియవు. బయటి ప్రపంచందాకా ఎందుకు? చాలా ఘటనలు కుటుంబ సభ్యులకే తెలియవు. ధైర్యం చేసి బాధితురాలు కోర్టుకు వస్తే అక్కడమళ్లీ అదే చర్చ జరుగుతుంది. ముద్దాయి పాల్పడిన లైంగిక చర్యకు తాను సమ్మతించలేదని బాధితురాలు రుజువు చేసుకునే స్థితి ఏర్పడుతుంది. న్యాయస్థానాలు పితృస్వామ్య లైంగిక నీతిని అద్దాలకు తగిలించుకొని ఆమె నడవడికను పరిశీలించి నిర్ణయం చేస్తాయి.

తాను నేరం చేయలేదని రుజువు చేసుకునే బాధ్యత ముద్దాయిపైన పెట్టడానికి వీలు లేదని నమ్మే ప్రజాస్వామ్య చట్టం, పితృస్వామ్య లైంగిక నీతి ప్రభావం వల్ల రేప్ కేసులలో తన 'శీలాన్ని' రుజువు చేసుకునే బాధ్యత బాధితురాలిపైన పెట్టడానికి వెనుకాడడం లేదు. దీని ఫలితంగా బాధితురాలు మైనర్ బాలిక లేక వివాహిత అయితే నేరం రుజువయినంత సులభంగా మైనారిటీ తీరిన అవివాహిత అయితే రుజువు కావడం లేదని పరిశోధనలు తెలుపుతున్నాయి.

'ఆమె ఎటువంటిది?' అనే ప్రశ్న ఎంత అన్యాయంగా అర్థం వస్తుందనడానికి ఒక ఉదాహరణ. గత సంవత్సరం కర్నూలు జిల్లా నంద్యాల సమీపంలో మరియమ్మ అనే దళిత స్త్రీ సామూహిక అత్యాచారానికి గురి అయింది. ఎస్.సి., ఎస్.టి. అత్యాచారాల (నిరోధక) చట్టం ప్రకారం ఆమెకు ప్రభుత్వం పునరావాసం కల్పించవలసి ఉంది. కానీ ఈ విషయం జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువస్తే 'ఆమె వ్యక్తిత్వం మంచిది కాదు' అని చాలా కాలం సాగదీసాడు. ఆ చట్టంలో ఈ విషయం ఎక్కడా లేదు. కానీ కలెక్టర్ బుర్రలో ఉంది. సమాజం బుర్రలో ఉంది. చట్టంలో ఈ సంస్కృతి చొరబాటుకు వ్యతిరేకంగా మనదేశంలో మహిళా ఉద్యమం చేసిన ఆందోళన ఫలితంగా పార్లమెంట్ రేప్ చట్టాన్ని సవరించింది. కొన్ని సందర్భాలలో, లైంగిక క్రియ జరిగినట్టు రుజువయితే ఇక అది బలాత్కారంగా జరగలేదని రుజువు చేసుకునే బాధ్యత మగవాడిపైననే ఉంటుంది అని ఈ సవరణ అంటుంది. మహిళా ఉద్యమాల ఆందోళన ఫలితంగా చట్టాలలోనూ కోర్టుల వైఖరిలోనూ కొంత మార్పు వచ్చినప్పటికీ ఎక్కువ భాగం కేసులు కోర్టులో రుజువు కావడం లేదనేది వాస్తవం. బాధితురాలు తనకు జరిగిన 'అవమానాన్ని' ఎంత త్వరగా మరచిపోతే అంత మంచిదనే వైఖరి, కోర్టు కెక్కడం తనకు అంటుకున్న 'కళంకాన్ని' తానే ప్రచారం చేసుకోవడం అనే వైఖరి, వీటి ఫలితమైన ఒత్తిడులు స్త్రీలపైన పనిచేస్తాయి. కాబట్టి బాధితురాలి మాటకే విలువ ఇచ్చే చట్టాలు చేసినా సామాజిక సంస్కృతి, ఆలోచనా రీతి మారనిదే ఎక్కువ ప్రయోజనం ఉండదు. రేప్‌కు వర్తించేదే ఇతర రూపాలలో జరిగే లైంగిక వేధింపుకు కూడ వర్తిస్తుంది.

ఈ సాంస్కృతిక వాతావరణంలో జరిగేది న్యాయం కాదు, బాధితురాలిని కించపరిచే 'రాజీ' ఒప్పందాలు. న్యాయం కోసం పోరాడితే బాధితురాలి పరువే పోతుందనే సంస్కృతికి ఆజ్యం పోసే విధంగా వ్యాఖ్యలు చేసి కులం పెద్దలు, రాజకీయ నాయకులు, ఫాక్షనిస్టులు ఆమెకే మేలు చేసినట్టు రాజీ ఒప్పందాలు కుదురుస్తారు. రేప్ చేసిన వాడికే ఇచ్చి కట్నం లేకుండ పెళ్లి చేయడం బాధితురాలికి గొప్ప మేలు అనుకునే పెద్ద మనుషులు చాలామంది ఉన్నారు. వీరికి పోలీసుల అండ సంపూర్ణంగా ఉంది. అత్యాచారం జరిగిందన్న విషయం బయటపడితే బాధితురాలికే నష్టం కాబట్టి గోప్యంగా ఉంచడమే మంచిదన్న ఈ అప్రజాస్వామిక వాతావరణాన్ని ప్రజాస్వామ్య వ్యవస్థలయిన న్యాయస్థానాలు, పత్రికలు సంస్కరించే బదులు తమ పద్ధతిలో పెంచుతున్నాయి. రేప్ కేసుల్లో రహస్య విచారణ జరపాలని సిఆర్‌పిసి న్యాయస్థానాలను ఆదేశిస్తుండగా, పత్రికలు స్వీయ సెన్సార్‌షిప్ పాటిస్తున్నాయి. అత్యాచారం కేసులలో పత్రికలు సాధారణంగా బాధితురాలి పేరు తదితర వివరాలు రాయవు. (అయితే ఆమె వివాహితా కాదా అన్న అప్రస్తుతమయిన విషయాన్ని మాత్రం తప్పనిసరిగా రాస్తాయి !) నిజానికి ఆమె అత్యాచారానికి గురయిన సంగతి ఆమె సమీప వర్గాలలో ఎట్లాగూ దాగదు. దానివల్ల జరిగే నష్టమేదో ఎట్లాగూ జరుగుతుంది. ఇతర ప్రజలకు తెలియకుండ దాచిపెట్టడం వల్ల సాధించేది ఏమిటంటే ఆమెకే ఏదో కళంకం అంటుకుందన్న అభిప్రాయాన్ని బలపరచడమే.

లైంగిక హింస కేవలం మగవాడి కామాన్ని తీర్చే క్రియ మాత్రమే కాదు. తరచుగా అదొక రాజకీయ సాధనం, ఒక అణచివేత సాధనం. తమ మాట వినని స్త్రీని లైంగికంగా అవమానపరచడం, హింసించడం మగవాళ్ల ప్రయోగించే ఒక ప్రతీకార అస్త్రం. బూతుతిట్లు దీని అతిసాధారణ రూపం. అక్కడ మొదలయి ఈ ప్రతీకారం రేప్ దాకా పోగలదు. ఇది వ్యక్తిగత స్థాయిలోనే కాక సాంఘిక స్థాయిలోకూడ జరుగుతుంది. యుద్ధాలలోనూ సాంఘిక వర్గఘర్షణలలోనూ ఇరుపక్షాల స్త్రీలపైన లైంగిక హింస పెద్దఎత్తున జరుగుతుంది. బోస్నియా దీనికొక అతిఘోరమైన దృష్టాంతం మాత్రమే. ప్రతీ యుద్ధంలో, ఉద్యఅంతర్యుద్ధంలో ఇది జరుగుతుంటుంది. ప్రజా ఉద్యమాలపైన, వ్యవస్థను వ్యతిరేకించే రాజకీయ ఉద్యమాలపైన సైనికబలగాలు, పోలీసులు ప్రయోగించే అణచివేతలో లైంగిక హింస ఒక పద్ధతిప్రకారం ప్రయోగించడం జరుగుతుంది. దాడులు చేసేటప్పుడు స్త్రీలను అసహ్యమైన బూతు మాటలతో తిట్టడం ఈ అణచివేత వ్యూహంలో భాగమే. అక్కడ మొదలయినది తరచుగా రేప్ దాకా గ్యాంగ్‌రేప్‌దాకా పోతుంది. కాశ్మీర్ నుండి కరీంనగర్ దాకా దీనికి ఎన్నో ఉదాహరణలు. తెలంగాణా జిల్లాలలో ప్యారా మిలిటరీ బలగాలను ఎప్పుడు మోహరించినా స్త్రీలలో విపరీతమైన భయం నెలకొంటుంది. ప్రభుత్వ అణచివేత విధానానికి అదే సగం విజయం. ఈ సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం నుండి 40 కంపెనీల ప్యారా మిలిటరీ బలగాలను రప్పిస్తానని ఒకవైపు అంటుండగానే ఫిబ్రవరి 14న వరంగల్ జిల్లా మొగుళ్లపల్లి మండలం మేదరమెట్లలో వాయిదాపడిన పంచాయితీ ఎన్నికల నిర్వహణకు పోయిన సిఆర్‌పిఎఫ్ జవాను పోలింగ్ బూత్‌పక్కనే ఉన్న ఒక యింట్లోకి చొరబడి ఒక స్త్రీపైన అత్యాచారం చేసాడు.

పోలీసులే కాదు, రౌడీలు,ముఠానాయకులు, ఫాక్షనిస్టులు లైంగిక హింస ప్రయోగం ద్వారా స్త్రీలలో కలిగించే అభద్రతా భయాలను సమాజంపైన తమ హింసాత్మక ఆధిపత్యాన్ని నెలకొల్పడంలో ఒక సాధనంగా వాడుకుంటారు. ఇది మన రాష్ట్రంలో కర్నూలు, కడప జిల్లాల ప్రజలకు బాగా అనుభవమైన విషయమే. లైంగిక హింసకు గురయ్యే స్త్రీలకు పోలీసు వ్యవస్థ చేస్తున్న న్యాయం తక్కువే కానీ, పోలీసులు తమ చేతిలోకి చట్టబాహ్యమైన అధికారాన్ని తీసుకోవడాన్ని సమర్ధించుకోవడానికి లైంగిక నేరాలను ఒకసాకుగా వాడుకుంటారు. గుంటూరు ఎసికాలేజిలో ఒక అమ్మాయిని కించపరచిన వ్యక్తిని స్థానిక పోలీసులు సాక్షాత్తు ముఖ్యమంత్రి ఆదేశం మేరకు బేడీలు వేసి రోడ్ము మీద అర్ధనగ్నంగా ఊరేగించారు. రాష్ట్రంలో అనేక ఊర్లలో పోలీసులు ఇటువంటి అసహ్యకరమైన శిక్షలు వేస్తున్నారు. స్త్రీలను వేధించే రౌడీల పట్ల సమాజంలో ఉండే వ్యతిరేకతను దీనికోసం వాడుకుంటున్నారు. దీనివల్ల స్త్రీలకు జరిగే మేలెంతో కానీ పోలీసులు ఉపయోగించే చట్టవిరుద్ధమైన హింసకు ఈ రూపకంగా ఆమోదం లభించడం సమాజానికి చాలా నష్టకరం.

లైంగిక హింసగురించి మాట్లాడుకోవాలంటే ఈ విషయాలన్నిటి గురించి మాట్లాడుకోవాలి. ఈరోజు కళాసాంస్కృతిక రంగాలలో ప్రబలంగా ఉన్న పోకడలు, ప్రభుత్వం పనిగట్టుకొని అమలు చేస్తున్న ఆర్థిక విధానాలు, ప్రోత్సహిస్తున్న వ్యాపారనీతి, స్త్రీలపైన హింసను పెంచే దిశలో పయనిస్తున్నాయి. ఒక పక్క మహిళా ఉద్యమాల పురోగమనం ఫలితంగానూ, పెరుగుతున్న ప్రజాతంత్ర చైతన్యం ఫలితంగానూ, స్త్రీలు న్యాయం కోసం ముందడుగు వేస్తుండగా మరొకవైపు ఆర్థిక కళాసాంస్కృతిక రంగాలలో వేగంగా వస్తున్న మార్పులు సామాజిక వాతావరణాన్ని అందుకు భిన్నమైన దిశలో తీసుకుపోతున్నాయి. ఈ సందిగ్ధ సందర్భంలో పౌరహక్కుల సంఘం కడప జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న ఈ సదస్సుకు అందరూ హాజరయి చర్చలో పాల్గొనవలసిందిగా ఆహ్వానిస్తున్నాం.

22-3-97

- ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం (APCLC)

## సదస్సు

కడప పట్టణంలోని అమీన్ ఫంక్షన్ హాల్ (ట్రంకురోడ్డు)లో 1997 మార్చి 30 ఉదయం 10 గంటల నుండి

**ఓల్గా** సామాజిక సాంస్కృతిక నేపథ్యం

**కె. సుధ** లైంగిక హింస - చట్టాలు

**వసంత కన్నబిరాన్** మహిళా ఉద్యమం - లైంగిక హింస

**పి. చైతన్య** లైంగిక నేరాలు - కోర్టుల వైఖరి